ఇటు హర్షం.. అటు ఆందోళన

- పెన్‌పహాడ్ మండలంలో గృహజ్యోతి కొందరికే అమలు
- సాంకేతిక కారణాలతో చాలామందికి అందని పథకం
- ప్రతి నెలా రూ.15.99 లక్షల విద్యుత్ బిల్లుల మాఫీ



వినియోగదారుల మీటర్ రీడింగ్ తీస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

పెన్‌పహాడ్ : రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా మార్చి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తోంది. పెన్‌పహాడ్ మండలంలో పలు కుటుంబాలు ఈ పథకంలో లబ్ధి పొందుతున్నాయి. కానీ కొన్ని కుటుంబాలకు పథకం వర్తించకపోవడంతో నిరాశ చెందుతున్నారు. తమకు కూడా పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు.

గృహజ్యోతి పథకం..

ఇంతకు ముందు 200యూనిట్ల వరకు విద్యుత్ వాడుకున్న వినియోగదారులకు రూ. 900 వరకు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేయడంతో ఇంటి అవసరాలకు 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి ప్రభుత్వం బిల్లులు మాఫీ చేస్తోంది.

మండలంలో 8392 మీటర్లు..

మండలంలో మొత్తం 8392 విద్యుత మీటర్లు ఉన్నాయి. ఇంటిలో ఎక్కువ పోర్షన్లు ఉంటే ప్రతి పోర్షన్‌కు ఒక మీటర్ ఉంటుంది. ఎన్ని మీటర్లు ఉన్నా రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

సాంకేతిక కారణాలతో లబ్ధిపొందని కుటుంబాలు..

తెల్లరేషన్‌కార్డు దారుడు ఒక మీటర్ మీద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతాడు. వినియోగదారుడు ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులో తప్పనిసరిగా మీటరు యూనిక్ సర్వీస్ నంబర్‌ను (యూఎస్‌ఐడీ) జత చేయాలి. ఇదే విషయంలో కొంత మంది వినియోగదారులు నంబర్‌ను తప్పుగా వేయడంతో అటువంటి వారికి ఈ పథకం వర్తించలేదు. దీంతో ప్రతి నెలా మండల పరిషత్ కార్యాలయంలో దీని కోసం ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి పథకం అమలు కాని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. యూనిక్ సర్వీస్ నంబర్, తెల్లరేషన్‌కార్డు నంబర్, ఆధార్‌కార్డు నంబర్‌తో తిరిగి ఆన్‌లైన్ చేయడంతో సమస్య కొంత పరిష్కారమవుతోంది. పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామాల్లో ఈ పథకం కింద ఏప్రిల్‌లో 6569 గృహమీటర్ల మీద రూ. 15.99లక్షల లబ్ధి చేకూరింది. అయితే ఇంతవరకు లబ్ధి పొందని వారు వెంటనే తమకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఈ పథకం అందుతుందని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత జూన్‌లో ఈ పథకం అర్హులైన అందరికీ అందజేస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

పథకం అమలు కాలేదు

గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్నా. కానీ నాకు ఫ్రీ బిల్లు అమలు కాలేదు. దరఖాస్తు చేసుకున్నా బిల్లు వస్తుండడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహ జ్యోతి పథకం అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.

– షేక్ రంజాన్, అనంతారం

అర్హులకు పథకం వర్తిస్తుంది

గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అమలు అవుతుంది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత మిగిలిన అర్హులకు పథకం వర్తించేలా చర్యలు చేపడతాం.

– రమేష్, ఇన్‌చార్జ్ విద్యుత్ ఏఈ

మున్సిపల్ ముద్రగల మాంసాన్నే విక్రయించాలి



యాటలకు వైద్యపరీక్షలు చేస్తున్న అధికారులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో మటన్ వ్యాపారులు తప్పనిసరిగా మున్సిపల్ కబేళాలో వెటర్నరీ డాక్టర్ పర్యవేక్షణ, మున్సిపల్ ముద్ర గల యాట మాంసాన్ని మాత్రమే విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసు అన్నారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కబేళాలో యాటలకు వెటర్నరీ డాక్టర్ జానయ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఆదివారం వైద్య పరీక్షలు పూర్తయిన మాంసాన్ని ప్రజలు కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు వైద్య పరీక్షలు చేయకుండా నేరుగా అమ్మితే రూ.10,000 పెనాల్టీ విధిస్తామని, మాంసంపై ఫినాయిల్ పోయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేష్, బూర సతీష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, మున్సిపల్ జవాన్లు కొండేటి వెంకన్న, పరశురాములు, పోతుగంటి వేణు, శ్రవణ్ కుమార్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను జయప్రదం చేయాలి



తిరుమలగిరిలో కార్మికులతో మాట్లాడుతున్న జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య

తిరుమలగిరి : మే 1వ తేదీన జరిగే మే డే వేడుకలను విజయవంతం చేయాలని జీఎంపీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. ఆదివారం ఆయన తిరుమలగిరి మండల కేంద్రంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మోసం చేసిందని విమర్శించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీర్మాల ఎల్లమ్మ, పత్తెపురం సుగుణ, రేణుక, పద్మ, సోమయ్య, ప్రసాద్, అంజయ్య, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంత్ నిరంకారి సేవలు అభినందనీయం



భానుపురి : రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ఆత్మకూర్ (ఎస్) : సంజీవరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

భానుపురి : సమాజంలో సంత్ నిరంకారి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం మానవ ఐక్యత దినోత్సవం పురస్కరించుకొని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంత్ నిరంకారి ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మున్ముందు కూడా కొనసాగించాలని, అందుకు తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సరళ దేవి, కడారు నరసింహారెడ్డి, విద్యాసాగర్, రమాదేవి, శోభ, నిర్మల, అంజలి, రాజేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి మృతి

ఆత్మకూర్ (ఎస్) : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పన్నాల సంజీవరెడ్డి (60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున తన స్వగ్రామమైన పాతసూర్యాపేట గ్రామంలో మృతి చెందారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మృతదేహానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ వెంకట నారాయణగౌడ్, నూతనకల్ జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, పుట్టా కిశోర్ తదితరులు ఉన్నారు.

గాలి బీభత్సం.. మోస్తరు వర్షం

భానుపురి : సూర్యాపేట పట్టణ వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి పట్టణ వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం మారి ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. సాయంత్రం మబ్బులు కమ్మి గాలి దుమారంతో మోస్తరు వర్షం కురిసింది. ప్రధానంగా గాలి దుమారానికి అంజనాపురి కాలనీ, విద్యానగర్‌తో పాటు 2, 17, 29, 21, 40, 8 వార్డుల్లో చెట్లు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆయా చోట్ల కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది విరిగిపడిన చెట్లను తొలగించారు. గాలి దుమారంతో ప్రజలు కాస్త ఇబ్బంది పడినా.. వాతావరణం చల్లబడడం, తేలిక పాటి జల్లులతో ఉపశమనం పొందారు.



సూర్యాపేట పట్టణంలో కురుస్తున్న వర్షం



అంజనాపురి కాలనీలో విరిగిపడ్డ చెట్టు

ఆత్మకూర్(ఎస్)లో ఈదురు గాలులు..

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీచాయి. ఉదయం నుంచి ఎండతోపాటు ఉక్కపోత అధికంగా ఉండడంతో జనం ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు పట్టి గాలి దుమారంతో తేలికపాటి జల్లులు కురిచాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



విద్యానగర్‌లో విరిగిపడిన చెట్టు



సూర్యాపేటలో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



ఆత్మకూరులో ధాన్యం రాశులపై పట్టాలు కప్పకుంటున్న రైతులు

కేంద్రంలో మూడోసారి బీజేపీదే అధికారం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు, బూర నర్సయ్యగౌడ్



నూతనకల్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

తుంగతుర్తి : కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సంకినేని వెంకటేశ్వర్‌రావు నివాసంలో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. 10ఏళ్ల కాలంలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా ప్రజలకు ఉత్తమ పాలన అందించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. ప్రపంచ దేశాలు సైతం భారతదేశం వైపు కన్నెత్తి చూడటానికి భయపడుతున్నాయని తెలిపారు. బీజేపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి హైటెన్షన్ వైర్ అని చెప్పుకుంటున్నాడని, వైరేమో కానీ హైటెన్షన్‌తో టెన్షన్ పడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎవరు ఏ పార్టీలోకి పోతారో, ప్రభుత్వం ఉంటుందో పోతుందో అని అయన టెన్షన్ పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం కూల్చే ఉద్దేశం బీజేపీకి లేదని, కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలే ప్రభుత్వాన్ని కూలుస్తాయని అన్నారు. అనంతరం మద్దిరాల మండల కేంద్రానికి చెందిన జెడ్పీటీసీ సూరాంబ–వీరన్న, తాళ్లపల్లి సత్యనారాయణ, ఎల్లబోయిన భిక్షం, వెలుగు సైదులు, నారాయణలతో పాటు మరో 100 మంది వివిధ పార్టీల నుంచి బీజేపీ చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంకినేని వరుణ్‌రావు, కాప రవి, మల్లేపాక సాయిబాబు, కొమరయ్య, అనిల్ పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే బీజేపీ లక్ష్యం

నూతనకల్ : దేశంలో అవినీతి రహిత పాలన అందించడమే బీజేపీ ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నూతనకల్‌లో మండల కేంద్రంతోపాటు బిక్కుమళ్ల, తాళ్లసింగారం గ్రామాలకు చెందిన 150కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టిన పథకాలే ప్రజల మనసుల్లో సజీవంగా నిలిచినట్లు తెలిపారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రజల్లో తిరగాల్సిన మంత్రులు అవినీతి అక్రమాలకు పాలపడి జైలు జీవితం గడిపారని అన్నారు. సామాన్య ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించాలని పిలుపునిచ్చారు. విద్యావంతుడిగా, ప్రముఖ వైద్యుడిగా పేరు ప్రఖ్యాతలు గాంచి పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించిన బూర నర్సయ్యగౌడ్‌ను ఎంపీగా గెలిపించాలని కార్యకర్తలను, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, కాప రవి, సలిగంటి వీరేందర్, మద్ది సంజీవరెడ్డి, అబీద్, కొప్పుల క్రాంతిరెడ్డి, జక్కుల ఉప్పలయ్య, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బత్తిని లింగయ్య, కప్పల సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంటాలను త్వరితగతిన నిర్వహించాలి



నూతనకల్ : గుండ్లసింగారంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను త్వరితగతిన నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యానికి వెంటనే కాంటాలు నిర్వహించి, తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, ఏఈఓలు, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేయాలని మండల ఏపీఎం వలిశెట్టి మల్లేష్, డీటీసీఎస్ విజయ్‌శేఖర్ కోరారు. ఆదివారం జాజిరెడ్డిగూడెంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. 17 శాతంలోపు తేమ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ పాటి వెంకట్ రెడ్డి, సంఘబంధం అధ్యక్షురాలు కుంభం వెంకటరమణ, వీఓఏ సురాంబ, నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్డులు ఇవ్వాలి

నడిగూడెం : భవన నిర్మాణ కార్మికులకు వెంటనే సంక్షేమ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వల్లెపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం నడిగూడెం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుంజ లక్ష్మయ్య, అధ్యక్షుడిగా గుంజ మురళి, ప్రధాన కార్యదర్శిగా దేవరంగుల యల్లయ్య, 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం సీఐటీయూ అనుబంధం మండల అధ్యక్షుడు పల్లపు తిరుమలేష్, మండల ప్రధాన కార్యదర్శి చిక్కుళ్ల ఉపేందర్, గుంజ చినవెంకన్న, బాలయ్య, పెదవెంకన్న పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వెంపటిలో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు, స్నేహితులు

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన గోరోజు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి పదోవ తరగతి స్నేహితులు, గ్రామస్తులు కలిసి ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేద బాధిత కుటుంబానికి రూ.1,29,150 ఆర్థికసాయం, 3 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఏర్పాటు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు హాజరైన 457 మంది విద్యార్థులకు బీఎస్పీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మాతంగి యేసుబాబు తాగునీరు ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

మునగాల : నర్సింహులగూడెంలో ఆదివారం కంఠ మహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కౌండిన్య గౌడసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉయ్యాల నర్సయ్య, రాజేష్, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాగారం జెడ్పీటీసీ



మునుగోడులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జెట్పీటీసీ, తదితరులు

నాగారం : నాగారం మండల జెడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్ బీఆర్ఎస్ పార్టీని వీడి మునుగోడులో ఆదివారం ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో జెడ్పీటీసీ కడియం ఇందిరా పరమేశ్వర్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జెడ్పీటీసీ కడియం ఇందిరా పరమేశ్వర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాజుల వీరయ్య, కడియం స్వామి, కడియం శ్యాం, చిప్పలపల్లి శివ, చిప్పలపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టు వద్ద నగదు పట్టివేత



నగదును చూపుతున్న అధికారులు, పోలీసులు

తుంగతుర్తి : తిరుమలగిరి మండల సరిహద్దు ఈదులపర్రె తండా వద్ద పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆదివారం అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.6,29,000 నగదును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌టీ టీం లీడర్ నవీన్‌కుమార్, స్థానిక ఎస్ఐ సత్యనారాయణలు మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా గుండాల గ్రామానికి చెందిన పట్ల రమేష్ తన కారులో గుండాల నుంచి తిరుమలగిరికి వెళ్తుండగా రూ. 4.99లక్షలు, అలాగే పాలకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల వెంకన్న తన కారులో జాజిరెడ్డిగూడెం వెళ్తుండగా రూ.1.30లక్షలు పట్టుబడ్డాయని తెలిపారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో డబ్బులను స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్‌టీ టీం లీడర్ శ్రీనివాస్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెక్‌పోస్టు బృందం గోపి నాయక్, మల్లయ్య, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

జహంగీర్ పర్యటనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గంలోని తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో ఈ నెల 23న జరిగే భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ ఎన్నికల ప్రచార పర్యటనను జయప్రదం చేయాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎండీ జహంగీర్ 35 ఏళ్లుగా కమ్యూనిస్టులో పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. భువనగిరి గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని తెలిపారు. కమ్యూనిస్టులు నడయాడిన ఈ గడ్డలో వారి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ప్రజా నాయకుడిగా ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి జహంగీర్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం మతం, దేవుళ్ల పేరిట ప్రజలను విభజిస్తూ పాలిస్తుందని, దుర్మార్గమైన పాలనకు గోరి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రజలు మేలుకోకపోతే రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జహంగీర్‌ను రాజకీయాలకు అతీతంగా గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, సీపీఎం మండల కార్యదర్శులు కడియం కుమార్, వజ్జె శ్రీనివాస్, నాయకులు సిగ వెంకన్న, దేవరకొండ యాదగిరి, గుడిపూరి వెంకటేశ్వర్లు, కాండె భిక్షం, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితులకు పరామర్శ



పరామర్శిస్తున్న గాదరి కిషోర్‌కుమార్

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు బొంకూరి మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆదివారం మధును పరామర్శించారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొంకూరి సైదులు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అతడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, నాయకులు తడకమల్ల రవికుమార్, పరమేశ్వర్, నాగమల్లు, తదితరులు పాల్గొన్నారు.

23న హనుమాన్ చాలీసా పారాయణం

భానుపురి : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భగవద్గీత మందిరంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు శ్రీభానుపురి శ్రీనివాస భజన మండలి ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు భజన మండలి అధ్యక్షుడు నాగవల్లి దశరథ, కోశాధికారి రాజు భాస్కరాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు ఫస్ట్ న్యాసకులు డాక్టర్ రామడుగు రాంబాబు ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

వాతావరణంలో మార్పుతో రైతుల ఆందోళన

అర్వపల్లి : వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడం, పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ పక్క వరి కోతలు ముమ్మరంగా జరుగుతుండగా మరో వైపు కొనుగోలు కేంద్రాలు, రహదారులు ధాన్యంతో నిండిపోయాయి. అకాల వర్షం పడితే తమ పరిస్థితి ఏమిటని అన్నదాతలు వాపోతున్నారు. ఆదివారం రాత్రి మండలంలో వాతావరణంలో మార్పు ఏర్పడి ఈదురు గాలులు వచ్చాయి. వర్షం పడుతుందేమోనని రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపారు. ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

సీపీఎం నాయకుడు మృతి



లింగయ్య(ఫైల్)

పెన్‌పహాడ్: నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఐతబోయిన లింగయ్య(80) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. అతడి మృతదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి నలుగురు కుమారులు ఉన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు కాకులారపు జనార్ధన్‌స్వామి, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

కోదాడరూరల్ : నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జ్ కటికం సత్తయ్యగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మోతె, నడిగూడెం, మునగాల మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈనెల 23న మూడు మండలాల్లో నిర్వహించే ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. రైతుల పొలాలు ఎండిపోతున్నా కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడంలేదన్నారు. పొలాలు ఎండిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు శీలం సైదులు, తొగరు రమేష్, పల్లా నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు కందిబండ సత్యనారాయణ, రాంరెడ్డి, సీతారాములు, నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, చంద్రయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.